

సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు



కామారెడ్డిలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

# జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌పై నిరసన వెల్లువ

**రాష్ట్రవ్యాప్తంగా భగ్గుమన్న బీఆర్‌ఎస్ శ్రేణులు**

**నల్లబ్యాడ్జీలు ధరించి భారీగా ర్యాలీలు**

- ఊరూరా రేవంత్ దిష్టిబొమ్మల దహనం
- జగదీశ్‌రెడ్డి దళిత పక్షపాతి అని నినాదాలు
- సస్పెన్షన్ ఎత్తివేయాలని శ్రేణుల డిమాండ్
- పలుచోట్ల కార్యకర్తల అరెస్టు, విడుదల



ములుగు జిల్లా ఏటూరునాగారంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ శ్రేణులు



సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు



మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌ను నిరసిస్తూ మలక్‌పేటలోని నల్లగొండ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు పగిళ్ల నర్సింగ్, నేతలు, తదితరులు

న్యూస్ నెట్‌వర్క్, మార్చి14 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడంపై రాష్ట్రవ్యాప్తంగా బీఆర్‌ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసనలు చేపట్టారు. హోలీ పండుగ సంబురాలు ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వ నియంతృత్వ ధోరణిపై బీఆర్‌ఎస్ శ్రేణులు సమరోత్సాహాన్ని ప్రదర్శించాయి. ఆదిలాబాద్ నుంచి ఆలంపూర్ దాకా అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశాయి. కొన్నిచోట్ల సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోలు, ఫ్లెక్సీలనూ దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ చర్యను వ్యతిరేకిస్తూ నియోజకవర్గ కేంద్రాల్లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాలను ఇచ్చి నిరసన తెలిపారు. ప్రభుత్వ నియంతృత్వ వైఖరికి వ్యతిరేకంగా నినదించారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలను ఖండించారు. అసెంబ్లీలో తమ గొంతు నొక్కితే ప్రజాకోర్టులో తేల్చుకుంటామని శ్రేణులు హెచ్చరించాయి. ఈ నిరసన కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు, అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు పోటీపడి పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలు సహా పలు విద్యాసంస్థలకు సెలవు ఉన్నా బీఆర్‌ఎస్వీ, ఇతర విద్యార్థి నాయకులు ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలపై నిరసన తెలిపారు.

### భారీ నిరసన ప్రదర్శనలు

నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని బీఆర్‌ఎస్ కార్యాలయం నుంచి సాగర్ రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వరకు మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, ఇతర నేతల నేతృత్వంలో శ్రేణులు నల్లబ్యాడ్జీలు ధరించి భారీ ర్యాలీ తీశారు. దేవరకొండ, మునుగోడులో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో రాస్తారోకో నిర్వహించారు. మఠంపల్లి, నేరేడుచర్ల, పాలకీడులో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి దహనం చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో దళిత నేతలు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తంచేశారు. హనుమకొండ జిల్లా కాజీపేటలో పెద్ద ఎత్తున చేరు



మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌ను నిరసిస్తూ నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో రోడ్డుపై బైఠాయించిన నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

కున్న శ్రేణులు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను కార్యకర్తలు దహనం చేశారు. ఈ క్రమంలో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం చోటు చేసుకున్నది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని కామారెడ్డి, ఆర్మూర్, మాక్లూర్, వేల్పూర్, కమ్మర్‌పలి, మోర్తాడ్, బాల్కొండ, ఎల్లారెడ్డి, జుక్కల్ తదితర మండలాల్లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించి, ప్రభుత్వ, రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బీఆర్‌ఎస్ నిరసన ప్రదర్శనలు నిర్వహించి, ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. పలు చోట్ల బీఆర్‌ఎస్ నేతలను రోడ్లపైకి రాకుండా పోలీసులు అడ్డుకొని, అరెస్టు చేశారు. అయినా గద్వాల, నాగర్‌కర్నూల్, జడ్చర్ల, అచ్చంపేట, కొల్లాపూర్ పట్టణాల్లో ఆందోళనలు నిర్వహించారు.

### పోలీసులతో బీఆర్‌ఎస్ శ్రేణుల తోపులాట

ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనానికి బీఆర్‌ఎస్ నాయకులు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లా కేంద్రాల్లో దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ధర్నా నిర్వహించాయి. వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఖమ్మం జిల్లా మధిర పట్టణంలో జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఇల్లెందు పట్టణంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకొని పలువురిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో పోలీసుల చర్యను నిరసిస్తూ బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఠాణా ఎదుట రోడ్డుపై నిరసన తెలిపారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని ఆదిలాబాద్, బోథ్, నార్నూర్, ఖానాపూర్ మండల కేంద్రాల్లో దిష్టిబొమ్మలను దహనం చేశారు. మంచిర్యాల ఐబీ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. బెల్లంపల్లిలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని పలుచోట్ల బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకొని పోలీస్‌స్టేషన్లకు తరలించారు. హైదరాబాద్‌లోని మలక్‌పేట నియోజకవర్గం పరిధిలోని నల్లగొండ చౌరస్తాలో బీఆర్‌ఎస్ శ్రేణులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

### వైఫల్యాలను ఎత్తిచూపినందుకే..

ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపినందుకే జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ధ్వజమెత్తారు. బడ్జెట్ సెషన్ పూర్తయ్యేదాకా చేయడం మంచి పద్ధతి కాదని, ఇది రేవంత్‌రెడ్డి దుష్టపాలనకు నిదర్శనమని విమర్శించారు. ఇచ్చిన హామీలను అసెంబ్లీ వేదికగా జగదీశ్‌రెడ్డి ఎండగట్టిన వైనాన్ని జీర్ణించుకోలేకే ఆయనను సస్పెండ్ చేశారని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు విమర్శించారు. ప్రజా సమస్యలపై గళమెత్తుతున్న ప్రతిపక్ష పార్టీ నేతల గొంతు నొక్కేందుకు రేవంత్ సర్కారు యత్నిస్తున్నదని అడ్వొకేట్ జేఏసీ అధికార ప్రతినిధి ఉపేంద్ర ధ్వజమెత్తారు.

## గులాబీ శ్రేణుల సమరోత్సాహం: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని ఏకపక్షంగా సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సమరోత్సాహాన్ని ప్రదర్శించిన పార్టీ శ్రేణులకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. హోలీ పండుగలో కుటుంబ సభ్యులు, స్నేహితులతో నిమగ్నం కావాల్సిన నాయకులు, కార్యకర్తలు పార్టీ పిలుపులో భాగస్వామ్యమై కార్యక్రమాన్ని విజయవంతం చేశారని కొనియాడారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక చర్యలను అసెంబ్లీ వేదికగా ఎండగట్టిన ప్రజాప్రతినిధి జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని.. ప్రజా సమూహం జీర్ణించుకోలేకపోతుందనడానికి నిరసన కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులతోపాటు ప్రజలూ స్వచ్ఛందంగా పాల్గొనడమే నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలను, హామీల అమలులోని మోసాన్ని ఇదే స్ఫూర్తితో ఎప్పటికప్పుడు ఎండగడదామని కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతరావు, పార్టీ శ్రేణులు



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## బీఆర్‌ఎస్ గొంతు నొక్కేందుకే సర్కారు కుట్ర

మొదటిపేజీ తరువాయి...

విమర్శించారు. తానెక్కడా స్పీకర్‌ను ఏకవచనంతో మాట్లాడలేదని, సభా సంప్రదాయాలకు వ్యతిరేకంగా వ్యవహరించలేదని తెలిపారు. స్పీకర్ సభ్యులందరినీ సమానంగా చూడాలని కోరానని, బీఆర్‌ఎస్ సభ్యులు ఎవరు కూడా సభను తప్పుదోవ పట్టించలేదని గుర్తుచేశారు. ఘటన తర్వాత తాము స్పీకర్‌ను కలిశామని, తప్పు జరిగినట్టు భావిస్తే గత సంప్రదాయాల ప్రకారం వ్యవహరించాలని కోరినట్టు తెలిపారు. ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి డైరెక్షన్ ప్రకారమే సభను వాయిదా వేశారని ఆరోపించారు. స్పీకర్‌ను తాను అగౌరవపర్చలేదని, ఒకవేళ తాను తప్పుగా మాట్లాడి ఉంటే కాంగ్రెస్ నేతలు వీడియో విడుదల చేసేవారని తెలిపారు. సస్పెన్షన్ తర్వాత కనీసం లెజిస్లేటివ్ పార్టీ కార్యాలయంలో కూడా తనను కూర్చోనివ్వలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తన గొంతు ఎవరూ నొక్కలేరని తేల్చిచెప్పారు. సస్పెన్షన్ అంశంపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తో చర్చించి, భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు.

## కిమ్‌తో ఇప్పటికీ మంచి సంబంధాలే ఉన్నాయి

**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడి**

వాషింగ్టన్, మార్చి 14: తాను మొదటి పర్యాయం అధికారంలో ఉన్నపుడు పలు మార్లు సమావేశమైన ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్‌తో తనకు ఇప్పటికీ మంచి సంబంధాలు ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. గురువారం వైట్ హౌస్‌లోని తన కార్యాలయంలో నాటో ప్రధాన కార్యదర్శి మార్క్ రూటెతో సమావేశమైన ట్రంప్‌ను ఉత్తర కొరియా నాయకుడు కిమ్‌తో మళ్లీ సంబంధాలను పునరుద్ధరించుకుంటారా అని విలేకరులు ప్రశ్నించారు. తనకు కిమ్‌తో మంచి సంబంధాలు ఉండేవని, చూద్దాం ఏం జరుగుతుందో అంటూ ట్రంప్ వారికి బదులిచ్చారు. జనవరి 20న రెండో పర్యాయం అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఉత్తర కొరియాను అణు శక్తిగా ట్రంప్ అభివర్ణించారు. మొదటి పర్యాయం అధికారంలో ఉన్నపుడు చేపట్టలేకపోయిన అణు నిరాయుధీకరణ ప్రయత్నాలకు బదులుగా ఇప్పుడు ఆయుధాల తగ్గింపుపై కిమ్‌తో చర్చలు జరగాల్సి ఉందన్నారు.

## పీఆర్సీ ఫట్.. డీఏలూ డౌటే!

- ఉద్యోగుల ఆశలపై సర్కారు నీళ్లు
- సీఎం వ్యాఖ్యలపై ఉద్యోగుల ఫైర్
- మెరుగైన ఫిట్‌మెంట్‌పై అనుమానాలు
- రిటైర్మెంట్ బెనిఫిట్లు, బిల్లులతో పాటు డీఏలు, పీఆర్సీ కోసం కోర్టుకెళ్లాల్సిన పరిస్థితి

> ‘రాష్ట్ర ఖజానా మొత్తం ఉద్యోగస్తులకు అప్పగిస్త. పైసా పైసా మొత్తం లెక్క మీకే అప్పజెప్త. ఒక్క పైసా కూడా నా దగ్గర పెట్టుకోకుండా మొత్తం పైసల్ ప్రభుత్వ ఉద్యోగులకు అప్పజెప్త. ఆఖరికి నా నెల జీతం కూడా మీకే ఇస్తా. ఏది ఎట్ల పంచాలో మీరే చెప్పండి. ఈ నెల జీతాలివ్వలేని పరిస్థితి ఉంటే రిజర్వ్ బ్యాంక్‌లో తలకాయ తాకట్టుపెట్టి రూ.4 వేల కోట్లు తెచ్చి జీతభత్యాలిచ్చాం. మీరేమో డీఏలు, కరువు భత్యాలు అడుగుతున్నరు’
> –ఇటీవల రవీంద్రభారతిలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వాఖ్యలు ఇవి.

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో తప్ప దేశంలోని ఏ రాష్ట్రంలో 5 డీఏలు పెండింగ్‌లో లేవు. కేవలం 3 రాష్ట్రాలు మాత్రమే ఉద్యోగులకు డీఏ బాకీపడ్డాయి. కేంద్రం ప్రభుత్వం ప్రతి 6 నెలలకోసారి టంచన్‌గా డీఏ విడుదల చేస్తున్నది. కానీ, మన దగ్గర 5 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. జూలై వస్తే ఉద్యోగులకు ఆరో డీఏ బాకీపడ్డట్టే. ఇక పీఆర్సీ గురించి ఊసేలేదు. 2023 జూలై 1 నుంచి కొత్త పీఆర్సీ అమలు చేయాల్సి ఉంది. పీఆర్సీ కమిటీ తన నివేదికను సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ దాన్ని స్వీకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదు. దీంతో డీఏలు, మెరుగైన ఫిట్‌మెంట్ కోసం ఉద్యోగులు పోరాటానికి సిద్ధపడుతున్నారు. ఇప్పటికే రూ.8 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. సీపీఎస్ ఉద్యోగుల వాటా రూ.2 వేల కోట్లు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయిస్తున్నారు. రేపు డీఏలు, పీఆర్సీల కోసం కూడా కోర్టుకెళ్లాల్సిన రోజులొస్తాయేమోనని ఓ ఉద్యోగ సంఘం నేత వ్యాఖ్యానించారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ‘మొత్తం ఖజానా మీకే అప్పగిస్తా.. మీరే పంచండి’ అని సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డే అన్నారంటే ఉద్యోగులకు ఏమీ ఇవ్వబోమని చెప్పినట్టేనని ఉద్యోగ సంఘాల నేతలు మండిపడుతున్నారు.

> ‘మేమేమైనా కొండమీది కోతిని అడుగుతున్నమా? గొంతెమ్మ కోరికలు కోరుతున్నమా? మాకు దక్కాల్సినవి, న్యాయమైనవే అడుగుతున్నం. కేంద్రం ప్రభుత్వం డీఏలు ఇవ్వడం లేదా? ఎప్పటికప్పుడు వేతన సవరణ చేయడం లేదా? ఉద్యోగులుగా మేం అడగడమే పాపమైనట్టు, మేం అడగడమే మానేయాలన్నట్టుగా సీఎం మాటలున్నాయి’
> – పేరు వెల్లడించేందుకు ఇష్టపడని ఉద్యోగ సంఘాల జేసీప నేత ఆవేదన ఇది.

### ఉద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకత

దీపావళి తర్వాత ఆర్థికేతర డిమాండ్లు, ఏప్రిల్ తర్వాత ఆర్థికపరమైన డిమాండ్లను పరిష్కరిస్తామని ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చింది. జేఏసీ నేతలు 54 డిమాండ్లను సర్కారు ముందుంచారు. వీటిలో ఆర్థికేతర డిమాండ్లు 33, ఆర్థిక పరమైనవి 21 ఉన్నాయి. తొలుత ఆర్థికేతర డిమాండ్లపైనా పరిష్కరించాలని ఉద్యోగ సంఘాలు కోరినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేదు. ఇప్పటికే దీపావళితోపాటు కొత్త సంవత్సరం, సంక్రాంతి కూడా పోయి ఉగాది రాబోతున్నది. కానీ, ఉద్యోగ సంఘాల డిమాండ్లలో ఇప్పటివరకు ఒక్కటి కూడా పరిష్కారం కాలేదు. ఆర్థికేతర డిమాండ్లనైనా ప్రభుత్వం పరిష్కరించలేకపోయింది. ఆర్థికేతర డిమాండ్లను కూడా పరిష్కరించకపోతే ఎట్లా అని ఉద్యోగ సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. ఉద్యోగుల సమస్యలను విన్నవించేందుకు వెళ్లిన తమను మంత్రులు, ఐఏఎస్ అధికారులు అవమానించినట్టు ఆరోపిస్తున్నారు. ఈ అవమానాలతోపాటు డిమాండ్ల పరిష్కారంలో సర్కారు వ్యవహరిస్తున్న తీరుపై తీవ్రంగా రగిలిపోతున్నారు.

## షిండే, అజిత్‌లకు సీఎం పదవి

**పీసీసీ మాజీ అధ్యక్షుడి ఆఫర్**

ముంబై, మార్చి14 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ మహారాష్ట్ర శాఖ మాజీ అధ్యక్షుడు నానా పటోలే అధికార కూటమి నేతలకు వల విసిరారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ఉప ముఖ్యమంత్రులు ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్‌లు కాంగ్రెస్‌కు మద్దతిస్తే, ఆ ఇద్దరికీ కొంత కాలం ముఖ్యమంత్రి పదవిని ఇస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఇటీవల ప్రధాని మోదీలా అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. మహాయుతి పార్టీల్లో షిండే, పవార్ పరిస్థితి దయనీయంగా ఉందని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో శివసేన మనుగడకు భరోసా లేదన్నారు. బీజేపీ చిన్న పార్టీలను బతకనివ్వదని, గతంలో షిండే అమలు చేసిన పథకాలన్నిటినీ ఆపేస్తున్నారని ఆరోపించారు.